క్లుప్తంగా

మదనాపురం తహసీల్దార్‌గా జేకే మోహన్



మదనాపురం: మండల తహసీల్దార్‌గా జేకే మోహన్ సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ అబ్రహంలింకన్ వనపర్తి ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ చేయడంతో పెద్దకొత్తపల్లి నుంచి జీకే మోహన్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ జేకే మోహన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా 47 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయనున్నారని పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



కొత్తకోట: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న హరిహరపుత్ర ధర్మశాస్త్ర అయ్యప్ప క్షేత్రం ఆలయ నిర్మాణానికి మండలంలోని అమడబాకుల గ్రామానికి చెందిన డబ్బి సత్యమ్మ, పెద్దరాములు వారి కుమారుడు రవిగౌడ్ పట్టణంలో మణికంఠ టీ స్టాల్ నడుపుతున్నారు. నిర్వాహకులు డబ్బి రాజేశ్వరమ్మ, రవిగౌడ్ దంపతులు వారి కుమారుడు మణికంఠ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆలయ నిర్మాణానికి రూ.1,01,916లు విరాళాన్ని అయ్యప్ప సేవా సమితి సభ్యులు ధూపం నాగరాజు, పొగాకు అనిల్‌కుమార్, బలిజ లింగేశ్వర్, విశ్వనాథం గంగాధర్, వేముల సుధాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, భాస్కర్, రవి, కరెంటు అంజి, భీమ కిషోర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో వారిని శాలువాతో సన్మానించారు.

వలంటీర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

అమరచింత/ఆత్మకూర్: వందేమాతరం ఫౌండేషన్, భారత్ లెర్నింగ్ అకాడమీ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి వందేమాతరం కార్యకర్తలుగా పనిచేయడానికి అర్హత గల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోఆర్డినేటర్ బాలకృష్ణ తెలిపారు. ఇంటర్ ఆపై అర్హత కలిగిన వారితో పాటు చదువుకుంటున్న విద్యార్థులు, ఉద్యోగస్తులు సైతం దరకాస్తు చేసుకోవాలని కోరారు. సంస్థ ట్రైనింగ్ అనంతరం అర్హత సాధించిన వారిని ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల వారు 63009 49477, 93921 87342, 81799 20338 లకు సంప్రదించాలని కోరారు.

మూడు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు



వనపర్తి రూరల్: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి వాహనదారులకు చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురిపై కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు, చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఉరి వేసుకొని యువకుడి బలవన్మరణం

పాన్‌గల్: ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ రోశయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కేతేపల్లికి చెందిన ఓరే శివ(21) హైదరాబాద్‌లో కారు మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 24న హైదరాబాద్ నుంచి స్వగ్రామం కేతేపల్లికి శివ 25న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా రింగ్ అవుతోంది కానీ లిఫ్టు చేయడం లేదు. చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన మహంకాళి ఫోన్ చేసి గ్రామ శివారులో ఎర్ర కుర్మయ్య వ్యవసాయ పొలంలో ఓ వ్యక్తి వేపచెట్టుకు బెల్టుతో ఉరి వేసుకొని చనిపోయినట్లు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా శివగా గుర్తించారు. ఘటనపై తండ్రి నాగేంద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

పల్లి సాగును ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి, హాజరైన అధికారులు

వనపర్తి: జిల్లాలో వంటనూనె గింజల పంట సాగును మరింత ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ 2024–25 నుంచి 2030–31 సమన్వయ సమావేశం ఏర్పాటు చేయగా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తినదగిన నూనెలపై జాతీయ మిషన్ ద్వారా వేరుశెనగ (పల్లి) సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ.8వేల నుంచి రూ.12 వేల వరకు సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తుందన్నారు. ఇందుకోసం జిల్లాలో ఎఫ్‌పీఓ (రైతు ఉత్పత్తి సంస్థల) సహకారంతో వ్యాల్యూ చైన్ క్లస్టర్, బ్లాక్ లెవెల్ డెమోన్‌స్ట్రేషన్లను ఏర్పాటు చేసి లక్ష్యం మేరకు రైతులు వేరుశెనగ సాగు చేసే విధంగా ప్రణాళికలు చేయాలని వ్యవసాయ అధికారులను సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు కొత్తగా విశిష్ట 1964 రకం వేరుశెనగ విత్తనాలను అందుబాటులోకి తెచ్చిందని, ఇది రైతులకు అధిక దిగుబడితో పాటు, లాభదాయకంగా ఉంటుందన్నారు. రైతువేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో పెబ్బేర్, పెద్దమందడి, పాన్‌గల్ రైతు ఉత్పత్తి కమిటీలను ఎంపిక చేసి ఈ ప్రాంతంలో అత్యధికంగా రైతులు వేరుశెనగ పంట సాగు చేసే విధంగా ప్రణాళికలు వేశామన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, పాన్‌గల్ ఏడీఏ చంద్రశేఖర్, వనపర్తి ఏడీఏ మున్నా, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి ఎల్‌డీఎం రైతు ఉత్పత్తి సంస్థల ప్రతినిధులు (ఎఫ్‌పీఓ), మండల వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమీకృత మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

పట్టణంలో అధునాతన పద్ధతుల్లో నూతనంగా నిర్మించిన సమీకృత మార్కెట్‌ను ఉపయోగంలో తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ తన చాంబర్‌లో మార్కెటింగ్ అధికారి స్వరణ్‌సింగ్, మున్సిపల్ కమిషనర్‌తో సమావేశం నిర్వహించారు. సమీకృత మార్కెట్ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో 32 కమర్షియల్ షాపులు, ఒక బ్యాంక్, ఒక సూపర్ మార్కెట్ పెట్టుకోడానికి అవకాశం ఉందని, మొదటి అంతస్తులో 49 కమర్షియల్ షాపులు, ఒక బ్యాంకెట్ హాల్ పెట్టుకునే అవకాశం ఉందన్నారు. వీటితో పాటు విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి అన్ని సదుపాయాలతో దాదాపు 80 మంది కూరగాయల వ్యాపారులకు ప్రయోజనం కలిగేలా 6 ప్లాట్‌ఫారాలు, చికెన్, మటన్ అమ్ముకునే వారికి 13 షాపులు ఏర్పాటు చేశామన్నారు. వీటన్నింటికి టెండర్లు ఆహ్వానించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి స్వరణ్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంకు మేనేజర్ శివకుమార్, డిప్యూటీ ఎల్డీఎం సాయి తదితరులు ఉన్నారు.

విస్తరణలో బాధితులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వలేదు



కమిషనర్‌కు విన్నవిస్తున్న పాన్‌గల్ రోడ్డు విస్తరణ బాధితులు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని పాన్‌గల్ రోడ్డులో రోడ్ల విస్తరణలో భాగంగా గతంలో ఆస్తి నష్టం కలిగిన తమకు నేటికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని బాధితులు సోమవారం పుర కార్యాలయంలోని కమిషనర్ వెంకటేశ్వర్ ఎదుట వాపోయారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్ల విస్తరణకు సహకరిస్తే డబుల్ బెడ్ రూంలో ఇళ్లు ఇస్తామని నేటికీ ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా ఉన్న స్థలాన్ని కోల్పోయి నిలువ నీడ లేక అద్దె ఇంట్లో బతికీడుస్తున్నామన్నారు. తాజాగా పాన్‌గల్ రోడ్డులో మిగిలిపోయిన ఇళ్లను తొలగించేందుకు మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారని, ప్రస్తుత విస్తరణ నష్టపోయిన వారికి డబుల్ బెడ్ రూమ్‌లు ముందుగానే కేటాయించాలని కొందరు డిమాండ్ చేయగా.. మరికొందరు ప్రభుత్వపరంగా స్థలం కేటాయించి ఇళ్లు నిర్మించే ఇవ్వాలని నినాదాలు చేశారు. మరికొందరు ఉన్న నివాసంలో రెండు, మూడు కుటుంబాలకు అనువుగా మా ఇళ్లు ఉండేదని, ఆ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని కుటుంబంలో వివాహమైన వారి సంఖ్యకు అనుగుణంగా అవసరమైన వారికి రెండు చొప్పున డబుల్ బెడ్‌రూమ్‌లు ఇచ్చే ఆలోచనను అధికారులు పరిశీలించాలని కోరారు. ప్రజలు విన్నవించిన ప్రతి అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి, ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్తానని కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వాహనదారుల సౌకర్యార్థంలో భాగంగానే విస్తరణ పనులు చేపడుతున్నామని, మరో 10 రోజుల్లోపు పాన్‌గల్ రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.

కిరణ్‌కుమార్ కృషి అభినందనీయం



పాన్‌గల్: పాఠశాల విద్యార్థులలో సాహిత్యంపై అభిరుచి కలిగిస్తూ బాల సాహిత్య విస్తృతికి నిరంతరం కృషి చేస్తున్న పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్ కృషి అభినందనీయమని పద్మభూషణ్ కేవీ వరప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారని ఉపాధ్యాయుడు సోమవారం తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్‌లో 'బడుల్లో బాలసాహిత్యం' అనే అంశంపై రెండు తెలుగు రాష్ట్రాల బాల సాహితీవేత్తలతో ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సెమినార్ సమావేశంలో పద్మభూషణ్ అవార్డు గ్రహీత, శాంతా బయోటెక్ సంస్థ అధినేత కేవీ వరప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించినట్లు ఉపాధ్యాయుడు పేర్కొన్నారు.

గిరిజనులకు పట్టాలిచ్చే వరకు పోరాటం



మాట్లాడుతున్న బాల్యానాయక్

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ, షాపురం గ్రామాల రెవెన్యూ శివారుల్లోని 8 తండాల గిరిజనులు సాగు చేస్తున్న జారిర్దార్ల భూములకు పట్టాలు ఇచ్చేవరకు పోరాటం ఆగదని తెలంగాణ గిరిజన సంఘం వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని కర్నెతండా, ముందలితండా తదితర తండాల్లోని గిరిజనులను కలిసిన ఆయన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు తరాల నుంచి గిరిజనులు సాగు చేసుకుంటున్న 495.7 ఎకరాల భూములు రాజుల పేర్ల మీద పట్టాలు ఉన్నాయన్నారు. ఎన్నో చట్టాలు వచ్చినా ఇప్పటికీ గిరిజనుల పేరున ఎందుకు పట్టాలు చేయలేదన్నారు. చెట్లు, పుట్టలుగా ఉన్న భూములను గిరిజనులు చదును చేసుకుని బోరుబావులు తవ్వి సాగు చేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వం, పాలకులు పట్టించుకోవడం లేదని వాపోయారు. కొంతకాలంగా గిరిజన రైతులు, భూ పట్టాల సాధన కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, నేటి పాలకులు ముందుకు వచ్చి గిరిజన రైతులను ఆదుకోవాలని కోరారు. గిరిజనులు కాలినడకన కలెక్టరేట్ కార్యాలయం వరకు వెళ్లి మొరపెట్టుకున్నా అధికారులు, ప్రభుత్వం, పాలకులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సక్రునాయక్, శ్రీనువాసులు, చాంధిబాయ్, లక్ష్మీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 108 పైలెట్ దినోత్సవం

వనపర్తి రూరల్: పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో 108 అంబులెన్స్ కార్యాలయంలో సోమవారం పైలెట్ దినోత్సవ వేడుకలను జిల్లా కోర్డినేటర్ రత్నమయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద ఘటన స్థలంలో క్షతగాత్రులు ప్రాణాలతో విలవిలాడుతున్న సమయంలో సమాచారం అందుకున్న వెంటనే హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితులను ఆస్పత్రిలో చేర్పించడంలో అంబులెన్స్ పైలెట్ల పాత్ర మరువలేనిదన్నారు. కార్యక్రమంలో అంబులెన్స్ పైలెట్లు రాములు, గోవిందు, భాస్కర్, నాగరాజు, షఫీ, నరసింహ, ఫరూక్, టెక్నీషియన్లు శేఖర్, శశి తదితరులు పాల్గొన్నారు.



లారీలు రాలే.. కేంద్రాల్లోనే ధాన్యం

- ఇబ్బందులు పడుతున్న రైతులు
- అకాల వర్షాలతో తడుస్తున్న ధాన్యం



పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

పాన్‌గల్: ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రాల్లో పోసిన ధాన్యం తూకం వేయడం లేదు. తూకం వేసిన వాటిని తరలించేందుకు సక్రమంగా లారీలు రాకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. మరోవైపు అకాల వర్షాలతో కేంద్రాల్లో ఉన్న ధాన్యం కాపాడుకోవడానికి రైతులు నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. మండలంలో సింగిల్‌విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం ఆలస్యం అవుతుండటంతో పాటు వాతావరణంలో మార్పులతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో ధాన్యాన్ని ఆరబోయడం .. సాయంత్రం కాగానే వర్షం భయంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు కుప్పగా చేయడం దినచర్యగా మారిందని రైతులు వాపోతున్నారు. వీటికి అవసరమైన కవర్ల అద్దె భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క తూకం చేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సక్రమంగా లారీలు రాకపోవడంతో వాటిని కాపాడుకోవడం మరింత భారంగా మారిందన్నారు. మండలంలో తెల్లరాళ్లపల్లి, దావాజిపల్లి, రేమద్దుల, శాగాపూర్, బుసిరెడ్డిపల్లి, కేతేపల్లి తదితర గ్రామాల్లో ఇంకా ధాన్యం నిల్వలు ఉన్నాయి. సింగిల్‌విండో ఆధ్వర్యంలోని కేంద్రాల్లో 45 వేలకు పైగా ధాన్యం బస్తాల నిల్వలు, 2.30 లక్షల బస్తాల వరకు ధాన్యం కాంటా చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. కేంద్రాల నుంచి ధాన్యం బస్తాలను తరలించేందుకు వచ్చే లారీల డ్రైవర్లకు రూ. 1000 చొప్పున ఎవరూ డబ్బులు ఇస్తే అక్కడికే లారీలను పంపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధాన్యం త్వరగా తూకం వేస్తూ, ధాన్యం బస్తాలను తరలించి ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై సింగిల్‌విండో సీఈఓ భాస్కర్‌గౌడ్‌ను వివరణ కోరగా.. లారీల రాకలో జాప్యంతో బస్తాల తరలింపు, ధాన్యం సేకరణలో ఆలస్యం అవుతుందన్నారు. విషయాన్ని జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు. దీంతో పాటు లారీ డ్రైవర్లకు డబ్బులు ఇచ్చే విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



రేమద్దులలో ధాన్యం బస్తాలపై కవర్లు కప్పిన దృశ్యం

బీటీ రోడ్డు వేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న యువకులు

మదనాపురం: మండలంలోని ఎర్రగట్టు నుంచి అజ్జకొల్లు గ్రామానికి బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని ఆర్టీఐ యాక్టివిస్ట్ ఫోరం మండల అధ్యక్షుడు కావలి అశోక్ గ్రామ యువకులతో కలిసి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ఆదర్శ్‌సురభికి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామం నుంచి మండల కేంద్రానికి రావాలంటే ఎర్రగట్టు వరకు రోడ్డంతా గుంతలుగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కురువ విష్ణు, షేక్, అశోక్, మొగిలి, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

కొత్తకోట: పట్టణంలో పలు అభివృద్ధి పనులు తక్షణమే ప్రారంభించాలని సోమవారం కొత్తకోట పట్టణ భారతీయ జనతా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సైదయ్యకు వినతిపత్రం అందజేసినట్లు మాజీ కౌన్సిలర్ కొమ్ము భరత్‌భూషణ్ తెలిపారు. పట్టణంలోని 11వ వార్డులోని కొత్తూరు బాటకు, అదేవిధంగా మిగతా వార్డులకు నిధులు మంజూరైన విషయం తెలిసినా.. ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలోని పలు వీధుల్లో సీసీ రోడ్లు వేయడానికి గత ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరైనా కూడా ఇప్పటి ప్రభుత్వం అభివృద్ధిని నీరుగారుస్తోందని ఆరోపించారు. తక్షణమే పనులు చేపట్టి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వనపర్తి శ్రీనివాస్‌రెడ్డి, సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజారాంయాదవ్, స్టార్ బాలు, ఆవుల రాఘవేందర్‌గౌడ్, తిరుపతిసాగర్, చిన్న, సురేష్‌గౌడ్, వెంకటేష్, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథాలపై ప్రచారం



త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం చేస్తున్న ఇందూ జ్ఞానవేది సభ్యులు

కొత్తకోట రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక కొత్తకోట, పెద్దమందడి, పెబ్బేరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం పెద్దమందడి మండలంలోని గట్లఖానాపూర్‌లో 100 ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సమితి సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకం అని, మతాలు నిషిద్ధం అని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాన్నారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందని, ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. మనిషి శరీరంలో దేవుడు మూడు ఆత్మలుగా విభజింపబడి ఉన్నాడని, జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశమన్నారు. భగవద్గీతలో కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం అనేవి దైవ ధర్మాలు అని వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుంచి బయటపడేసి మనిషికి ముక్తిని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, పురుషోత్తం, మాసన్న వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, తిరుమలేష్, కె.భాస్కర్‌రెడ్డి, ముజాఫర్‌ఖాన్, జాంగీర్, అనిత, శాంత, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల తదితరులు ఉన్నారు.

బీసీల ఐక్యతతోనే భవిష్యత్ తరాలకు మేలు



మాట్లాడుతున్న ఈదన్నయాదవ్

చిన్నంబావి: కుల, రాజకీయ సంఘాలకు అతీతంగా బీసీలంతా ఐక్యమైతే భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరుగుతుందని బీసీ చైతన్య సమితి మండల అధ్యక్షుడు ఈదన్నయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలంటే ఒక్క తాటి పైకి రారని, కులాలుగా విభజించబడి ఉన్నారని, కుల మత్తులో ఉన్నారనే అపోహలు ఉన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీసీలంతా ఐక్యతా చాటుకోవాలని కోరారు. అనంతరం బెల్లి లలిత వర్ధంతిని పురస్కరించుకొని ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాశన్నయాదవ్, బొల్లి కురుమయ్య, బాలస్వామి, రజినిబాబు, శేఖర్ యాదవ్, రమేష్, రజిని తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరేందర్

ఆత్మకూర్: సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లాటరీ తగిలిందని ఎవరైనా ఫోన్లు చేసి వ్యక్తిగత వివరాలు చెప్పొద్దని ఎస్ఐ నరేందర్ సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా సైబర్ నేరాలపై స్థానికులకు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అపరచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పరాదని, అలా చేస్తే బ్యాంక్ ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆధార్ అప్డేట్ అని, వాట్సాప్‌లో నగ్న వీడియోలు ఉన్నాయని, సైబర్ క్రైం పోలీసులమని, లింకులను ఓపెన్ చేయమని తదితర ఫోన్ కాల్స్‌కు స్పందించకూడదని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రోషయ్య, హెచ్‌సీలు మన్నెపురెడ్డి, గుప్త, సిబ్బంది రమేష్, హరికృష్ణ, సురేందర్, భూపాల్, రాములు, పుష్పలత, కృష్ణవేణి, స్థానికులు పాల్గొన్నారు.

రహదారులపై నిలుస్తున్న వర్షపు నీరు



పాత బాల్‌లింగం హోటల్ సమీపంలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

అమరచింత: పట్టణంలోని ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలుస్తుండటంతో వాహనదారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడటం, దుకాణదారులు మొరం మట్టితో తమ షాపుల ఎదుట ఎత్తుగా పర్చడంతో వర్షపు నీరు ముందుకు వెళ్లకుండా రహదారులపై నిలుస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వార్డుల్లో సీసీ రహదారులు నిర్మించి, రహదారులకు ఇరువైపులా మట్టిని వేయకపోవడంతో నీరు నిలిచి దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టణంలోని కాలనీలను సందర్శించకపోవడంతో మురుగుకాల్వలు, రహదారుల కబ్జాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

జూరాల ఆనకట్టపై వెలగని విద్యుత్ దీపాలు

అమరచింత: ఉమ్మడి జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు రాత్రి వేళ వెలగకపోవడంతో డ్యాం పరిసరాలతో పాటు రహదారి అంధకారంలో ఉన్నా పట్టించుకోనే అధికారులు కరువయ్యారు. జూరాల నీటితో జెన్‌కో అధికారులు విద్యుత్‌ను ఇక్కడి నుంచే తయారు చేస్తున్నా ప్రాజెక్టు పై మాత్రం విద్యుత్ వెలుగులకు నోచుకోలేకపోతుంది. జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ సమీపంలో చేపల విక్రయాలతో పాటు వంటకాలు లభిస్తుండటంతో సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు జూరాల ప్రాజెక్టు చేరుకుంటున్నా.. సాయంత్రం అవ్వగానే అక్కడి నుంచి వెళ్లిపోవాల్సిన దుస్థితి ఉంది. విద్యుత్ బల్బుల కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు అలంకారప్రాయంగా మారాయి. ఇప్పటికైనా ప్రాజెక్టు అధికారులు స్పందించి రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వెలిగేలా చూడాలని వాహనదారులు, పర్యాటకులు కోరుతున్నారు.



జూరాల ప్రాజెక్టుపై వెలగని విద్యుత్ దీపాలు